## ధరణి పోతే సంక్షేమం ఆగమైతది..



చిట్యాల, నవంబర్ 29 : రైతుల శ్రేయస్సు కోసం కేసీఆర్ తీసుకొచ్చిన ధరణి లేక పోతే రైతులు ఆగమైతరు. గతంలో వీఆర్‌వోలతో నానా ఇబ్బందులు పడ్డం. కాంగ్రెసోళ్లు ధరణి తీసేస్తమంటే మళ్లా కార్యాలయాల చుట్టు తిరగాల్సిందే. పైరవీకారుల కాలం వచ్చినట్లె. ఇప్పుడు ధరణి వల్లనే భూములు భద్రంగా ఉంటానయి. రైతుబంధు పడతాంది. రైతు మరణిస్తే రూ.5 లక్షల బీమా వత్తాంది. ధరణిపోతే ఇవన్ని ఎట్లా అత్తయి. పట్టాదారు, అనుభవదారు, కబ్జాదారుల కాలంలు మళ్లా తీసుకువస్తే గొడవ లైతయ్. రైతులపై పట్టాదారుల పెత్తనం కొనసాగుతది.మళ్లా ఎనకటి గోసలు పడాలె. అందుకే ధరణి, బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉంటనే రైతులకు బాగుంటుంది.

**- దొబిడి రఘుపతి, అందుకుతండా, చిట్యాల.**

## భూములకు భద్రత పెరిగింది..



మహాముత్తారం, నవంబర్ 29 : ధరణి వచ్చినంక భూమికి భద్రత పెరిగింది. సీఎం కేసీఆర్ ధరణి తీసుకురావడం చాలా మంచిదైంది. ధరణి రాక ముందు భూముల రిజిస్ట్రేషన్లు చేసుకోవాలంటే చాలా ఇబ్బందిగా ఉండేది. భూముల రిజిస్ట్రేషన్లు కావాలంటే పట్వారీలకు డబ్బులిచ్చి రోజుల తరబడి తిరిగెటోళ్లం. అయినా పని కాక పోయేది. కాని ధరణి వచ్చినంక క్షణాల్లో భూమి రిజిస్ట్రేషన్ అవడమే కాక కొనుగోలు చేసిన వారి మీదికి వెంటనే వత్తాంది. మధ్యవర్తులు, దళారీల ప్రమేయం లేకుండానే పోస్టులో పట్టా పాసు పుస్తకం వత్తాంది. ధరణి సేవలను కొనసాగించాలె. రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న కేసీఆర్‌కు అండగా ఉండాలె.

**- తడండ్ల దేవదాసు, రైతు, నిమ్మగూడెం, మహాముత్తారం.**



# నాటి ప్రకటనకు.. నేటితో ఐదేళ్లు..

- 2018 నవంబర్ 30న ములుగు జిల్లాకు హామీ
- అధికారంలోకి రాగానే అమలుకు చర్యలు
- జన్మదిన కానుకగా ఏర్పాటు చేసిన సీఎం కేసీఆర్
- ప్రజల గుండెల్లో చెరగని ముద్రవేసిన జననేత
- ఆసన్నమైన రుణం తీర్చుకునే సందర్భం..



ములుగు జిల్లా కేంద్రం

ములుగు, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా 2018 నవంబర్ 30న ములుగులోని తంగేడు మైదానంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభకు సీఎం కేసీఆర్ హాజరయ్యారు. 55 ఏళ్ల పాటు కొసాగిన కాంగ్రెస్, టీడీపీ పాలనలో కూడు, గుడ్డ, నీటికి అల్లాడి, వలస పోయి ఏజెన్సీ ప్రాంత ప్రజలకు సంతోషం కలిగించే ప్రకటన చేశారు. అప్పటికే 32 జిల్లాలు ఏర్పాటు చేసి పాలనను ప్రజల వద్దకు తీసుకుపోయిన ఆయన ములుగును 33వ జిల్లాను చేస్తానని సభా వేదికపై నుంచి హామీ ఇచ్చారు. అప్పటికే ములుగును జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో విలీనం చేశారు. ఈ నేపథ్యంలో ప్రజల కోరికను తెలుసుకొని బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపిస్తే జిల్లా ఏర్పాటు చేసి జనవరి 26న కలెక్టరేట్ వద్ద జెండా ఎగురవేసేందుకు వస్తానని కేసీఆర్ తెలిపారు. ఆ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఓటమి చెందినప్పటికీ అధికారంలోకి రాగానే ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. తన పుట్టిన రోజు కానుకగా 2019 ఫిబ్రవరి 17న జిల్లాను ఏర్పాటు చేసి ప్రజల చిరకాల కోరికను సీఎం కేసీఆర్ నెరవేర్చారు. ములుగును ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేసి కలెక్టర్, ఎస్పీలను నియమించారు. ఇక్కడి గిరిజన బిడ్డల కష్టాలు చూసిన సీఎం కేసీఆర్ ఇతర జిల్లాల మాదిరిగానే ములుగును అభివృద్ధి పథంలో నడిపించారు. 55 ఏళ్లలోరాని మార్పును ఐదేళ్లలోనే చేసి చూపించారు. రవాణా, విద్య, వైద్యం, వసతుల కల్పనలో పెను మార్పులు తీసుకువచ్చి ప్రజల వద్దకు పాలనను చేర్చారు. తాగునీటి కోసం తల్లాడిన గ్రామాలకు మిషన్ భగిరథ ద్వారా ఇంటింటికీ నల్లా నీటిని అందించి ఆడబిడ్డల కష్టాలు తీర్చారు. మెడికల్ కాలేజీ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. దీంతోపాటు మల్లంపల్లి మండలం, ఏటూరునాగారం రెవెన్యూ డివిజన్, ములుగును మున్సిపాలిటీగా మార్చారు. ప్రజలకు సీఎం కేసీఆర్ రుణం తీర్చుకునేందుకు చక్కని సందర్భం ఐదేళ్లకు వచ్చింది. జిల్లాను ఏర్పాటు చేస్తానని ప్రకటించిన నవంబర్ 30నే మరోసారి అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. ప్రజలు తమ ఓటు ద్వారా ములుగు గడ్డపై గులాబీ జెండాను పాతి కేసీఆర్‌కు కానుకగా ఇచ్చే అవకాశాన్ని కాలం ఇచ్చింది. ఇదే విషయాన్ని ఈనెల 24న బీఆర్‌ఎస్ అభ్యర్థి బడే నాగజ్యోతి గెలుపు కోసం ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా ప్రస్తావించి ములుగు నాది అని, ఈసారి పంచాయితీ పెట్టుకొని మరీ ఓట్లు అడుగుతానని ప్రజలకు గుర్తు చేశారు. 2018 నవంబర్ 30న జిల్లా ఏర్పాటుకు హామీ ఇవ్వడం, ప్రస్తుతం అదే తేదీన అసెంబ్లీ ఎన్నికలు రావడం యాధృచ్ఛికమైనప్పటికీ ప్రజలకు మాత్రం కేసీఆర్ రుణం తీర్చుకునే అవకాశం వచ్చింది.

## ఎన్నికలకు భారీ బందోబస్తు

- విధుల్లో రెండు వేల మంది పోలీసులు
- 307 పోలింగ్ కేంద్రాలు.. 202 లొకేషన్లు..
- సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు భద్రతా చర్యలు
- వెల్లడించిన ఎస్పీ గౌష్ ఆలం



ములుగు,నవంబర్ 29 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ములుగు నియోజకవర్గంలో గురువారం జరుగనున్న ఎన్నికలకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ గౌష్‌ఆలం బుధవారం వెల్లడించారు. రెండు వేలకు పైగా పోలీస్ సిబ్బందితో ఎన్నికలు సజావుగా సాగేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. 19 కంపెనీల ఆర్మ్‌డ్ పోలీస్ బలగాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి సుమారు 1000 మంది పోలీసులకు ఎన్నికల విధులను కేటాయించినట్లు తెలిపారు. 307 పోలింగ్ కేంద్రాలు, 202 పోలింగ్ లొకేషన్లున్నాయని, వీటిలో సాధారణ, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి అందుకు అనుగుణంగా భద్రతా చర్యలు చేపట్టామన్నారు. అటవీ ప్రాంతంలో ఈవీఎంల తరలింపులో ఎలాంటి ఆటంకం లేకుండా విస్తృత తనిఖీలు చేపట్టామని తెలిపారు. ఆకస్మిక తనిఖీలతో పాటు బైక్ పెట్రోలింగ్ నిర్వహిస్తూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిపేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ప్రజలు కూడా పోలీస్ శాఖకు సహకరించాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటింగ్‌లో పాల్గొనాలని ఎస్పీ పిలుపునిచ్చారు.



ఏటూరునాగారం : ఎన్నికల సందర్భంగా సీఆర్‌పీఎఫ్ బలగాల కవాతు




ములుగు రూరల్ : జిల్లా కేంద్రంలో ముస్తాబు చేసిన పోలింగ్ కేంద్రం



మంగపేట : పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

# పోలింగ్‌కు సకలం సిద్ధం

- కేంద్రాలకు చేరిన ఎన్నికల సిబ్బంది
- సకల సౌకర్యాల కల్పన
- 144 సెక్షన్ అమలుకు చర్యలు

ఏటూరునాగారం, నవంబర్ 29 : అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు నియోజకవర్గ వ్యాప్తంగా అధికారులు సర్వం సిద్ధం చేశారు. జిల్లా కేంద్రం నుంచి తమకు కేటాయించిన ఆయా పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల అధికారులు, సిబ్బంది సామగ్రితో చేరుకున్నారు. పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్లల్లో వెబ్ కెమెరాలు, టెంట్లు, నీటి వసతి ఏర్పాటు చేశారు. గతంలోనే ఆయా పోలింగ్ స్టేషన్ల వద్ద ఓటర్లు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ర్యాంపులు, మెట్లు నిర్మించారు. ప్రతి బూత్‌లో లైట్లు, ఫ్యాన్లు ఇతర సదుపాయాలను సమకూర్చారు. మారుమూల గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్లకు ముందస్తుగానే ఎన్నికల సిబ్బంది, ఈవీఎంలు చేరుకున్నాయి. బస్సుల్లో రూటు ఆఫీసర్లు పోలింగ్ సిబ్బందితో కలిసి వెళ్లారు. పోలింగ్ స్టేషన్ల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో పోలీసులు కూంబింగ్ చేపడుతున్నారు. పోలింగ్ స్టేషన్ల వద్ద 144 సెక్షన్ అమలుకు చర్యలు చేపట్టారు.

### ఆదర్శ పోలింగ్ కేంద్రాలు..

ములుగు రూరల్ : అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా గురువారం నియోజకవర్గ వ్యాప్తంగా ఓటింగ్ జరగనున్నది. ఇందులో భాగంగా ములుగు జిల్లా కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఆర్వో అంకిత్ ఆధ్వర్యంలో అందంగా ముస్తాబు చేశారు. ఓటు వేసేందుకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వసతులు కల్పించారు. మహిళలు, దివ్యాంగుల కోసం ఆదర్శ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. స్వేచ్ఛా వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాలను తీర్చిదిద్దారు.

### మంగపేటలో..

మంగపేట, నవంబర్ 29 : మండలంలోని 46 పోలింగ్ కేంద్రాలను బుధవారం ఎంపీడీవో శ్రీధర్, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అధికారి, అడిషనల్ డీఆర్‌డీవో బాలస్వామి బృందం సందర్శించింది. ఈ సందర్భంగా వారు మాటాడుతూ గురువారం జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ కేంద్రాల్లో తాగు నీరు, భోజన, వసతికి సంబంధించి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పారిశుధ్య సమస్య ఏర్పడకుండా పంచాయతీ సిబ్బందిని నియమించామన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనేందుకు వచ్చిన అధికారులు, సిబ్బందికి అవసరమైన భోజనాలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఓటు వేయడానికి వచ్చే దివ్యాంగుల కోసం ప్రత్యేక వాహనాలు, వారికి సహాయపడేందుకు అవసరమైన వలంటీర్లను నియమించినట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాల సందర్శనలో సెర్ప్ ఏపీఎం అప్పారావు, ఎంపీవో మమత, సీసీలు, పంచాయతీ కార్యదర్శులు, వీవోఏలున్నారు.



ఏటూరునాగారం : పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఎన్నికల అధికారులు, సిబ్బంది



మంగపేట : సామగ్రితో చేరుకున్న అధికారులు